క్లుప్తంగా

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్‌గా శ్రీనివాస్



శ్రీనివాస్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్

మిర్యాలగూడ : కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్‌గా వేములపల్లి మండల కేంద్రానికి చెందిన పుట్టల శ్రీనివాస్ నియామకమయ్యారు. గురువారం పట్టణంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆదిముళ్ల శంకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్‌లు పుట్టల శ్రీనివాస్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పుట్టల శ్రీనివాస్ మాట్లాడారు. తన నియామకానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, వేములపల్లి ఎంపీపీ పుట్టల సునీత, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, మధు, జానయ్య, చంటి, గిరి, వెంకన్న, పెద్దవెంకన్న పాల్గొన్నారు.

రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



మాట్లాడుతున్న నివేదితారెడ్డి

పెద్దవూర : ఖమ్మం బీఆర్ఎస్ సభలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కంకణాల నివేదితారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యతను ప్రభుత్వమే వహించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్ నాయక్, ఏరుకొండ నర్సింహా, చిట్టమాల శివ, శంకర్‌రావు, శంకర్‌రెడ్డి, ఆంజనేయులు, జగన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



మృతుడు లింగయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మన్నెం రంజిత్ యాదవ్

త్రిపురారం : మండలంలోని అంజనపల్లి గ్రామానికి చెందిన యాదాల లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్ మృతుడు లింగయ్య ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం లింగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట చెవుల రమేష్, చెవుల శేఖర్, మెండె రామలింగయ్య, మెండె లక్ష్మయ్య, చెవుల వంశీ, తదితరులు పాల్గొన్నారు.

దాడిపై పోలీసులకు ఫిర్యాదు

కొండమల్లేపల్లి : మండలంలోని చింతకుంట్ల గ్రామంలో గురువారం జరిగిన పాలకవర్గం సమావేశంలో తనపై దాడి జరిగిందని ఉప సర్పంచ్ యేకుల సురేష్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో జరుగుతున్న అవకతవకల విషయమై నిలదీసినందుకు గాను సర్పంచ్ పంది రుద్రమ్మ భర్త శ్రీనుతో దాడి చేయించినట్లు తెలిపారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

బీపీ మండల్‌కు నివాళి



బీపీ మండల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని రవీంద్రనగర్ లో గల రవీంద్ర భారతి హైస్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ కందుల మధుసూదన్‌రెడ్డి బీపీ మండల్ చిత్ర పటానికి పూలమాల వేసిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు చేగొండి మురళీయాదవ్, నాయకులు దాసరాజు జయరాజు, ఉపాధ్యాయులు లలిత, విజయలక్ష్మి, స్వరాజ్యం, దీపిక, మౌనిక, రమాదేవి, వెంకట్‌రెడ్డి, కిరణ్, వేణు, మధు, సునీత, జ్యోతి పాల్గొన్నారు.

ముందస్తు చెల్లింపునకు మొగ్గు

- మున్సిపాలిటీలో ఆస్తి పన్ను చెల్లింపుపై 5శాతం రాయితీ
- ఎర్లీ బర్డ్ స్కీం వినియోగించుకుంటున్న యజమానులు
- ఇప్పటి వరకు రూ.10లక్షల ఆస్తి పన్ను వసూలు
- 30వ తేదీ వరకు అవకాశం



ఆస్తి పన్ను చెల్లించిన వారికి రశీదు అందజేస్తున్న కమిషనర్

దేవరకొండ : మున్సిపాలిటీలో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించేవారి కోసం ప్రవేశపెట్టిన ఎర్లీబర్డ్ స్కీంను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ముందుగానే పన్నులు చెల్లించి 5శాతం రాయితీ పొందడానికి ఆసక్తి చూపుతున్నారు. దేవరకొండ మున్సిపాలిటీకి ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటికే రూ.10లక్షల ఆదాయం సమకూరింది. ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించిన సంబంధిత మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెలలో అమలు చేస్తు న్న ఎర్లీ బర్డ్ స్కీం సత్ఫలితాలు ఇస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పట్టణంలోని గృహ, వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక భవనాల యజమానుల కు ఈ అవకాశం కల్పించడంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పన్నులు చెల్లిస్తున్నారు. ఈ ఏడాది గడిచిన పది రోజుల్లో మున్సిపాల్టీకి రూ.10లక్షలు. ఆస్తి పన్ను వసూలైంది.పలువురు ఎర్లీ బర్డ్ స్కీంను వినియోగించుకొని రాయితీ పొందారు.

వందశాతం వసూళ్ల కోసం

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రధాన వనరు పన్నులే కావడంతో వందశాతం వసూళ్లే లక్ష్యంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ముందుకు సాగుతున్నారు. ఇందుకు గాను మున్సిపల్ అధికారులు, బిల్ కలెక్టర్లు వార్డుల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. పట్టణంలో చెత్త సేకరణ వాహనాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, చౌరస్తాల్లో ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేసి పన్ను వసూళ్లపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దేవరకొండ మున్సిపాలిటీలో 6585వేలకు పైగా గృహాలున్నాయి. గత ఆర్థిక సంవత్సరం రూ 2కోట్ల 21లక్షలు ఆస్తి పన్ను వసూలు చేయాలన్నది అధికారుల లక్ష్యం కాగా రూ 2కోట్ల 6క్షలు వసూలు అయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన పన్నుల వసూలు కోసం అధికారులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు.ఎర్లీ బర్డ్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది.ఆ తర్వాత మొండి బకాయిదారులపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే వంద శాతం పన్నుల వసూలే లక్ష్యంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రతి రోజూ ఉదయం నుండే ఇంటింటికీ తిరుగుతూ పన్నులు వసూలు చేస్తున్నారు.

సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి యజమానులు సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి దేవరకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి. ముందస్తుగా ఆస్తి పన్నులు చెల్లించే వారికి ప్రభుత్వం 5శాతం రాయితీ ఇస్తుంది. ఈ అవకాశాన్ని ప్రతి ఇంటి యజమాని సద్వినియోగం చేసుకోవాలి. మొండి బకాయిదారులు పన్నులు చెల్లించని పక్షంలో ఆస్తులను జప్తు చేస్తాం.

–వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కోరారు. గురువారం దేవరకొండ మండల పరిధిలోని పడ్మట్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మారుపాకుల అరుణసురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, ఎంపీడీఓ శర్మ, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, సర్పంచ్ యాదయ్య, ఎంపీటీసీ పర్వతాలు,వైద్య సిబ్బంది,తదితరులున్నారు.

ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన అవసరం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ

మిర్యాలగూడ అర్బన్ : ఇటీవల కాలంలో మారిన ఆహారపు అలవాట్లతో గుండె సంబంధిత వ్యాధులు ఎక్కువయ్యాయని, అందకే ప్రతి ఒక్కరికి సీపీఆర్(కార్డియో పాల్మరి రిసస్కిటేషన్)పై అవగాహన అవసరమని డీఎస్పీ వెంకటగిరి అన్నారు. గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ఐఎంఏ బిల్డింగ్‌లో వివిధ శాఖల ఉద్యోగులకు సీపీఆర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం డెమో ద్వారా సీపీఆర్ చేసే విధానంపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కేశా రవి, ఐఎంఏ అధ్యక్షుడు మాదవకుమార్, మున్సిపల్ కమిషనర్ రవీందర్ సాగర్, ఎంఈఓ బాలాజీ నాయక్, సీహెచ్ఓ శ్రీనివాసస్వామి, హెచ్ఈఓవాసుదేవరెడ్డి తో పాటు వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు తదితరులున్నారు.

రైతుల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం



జెండాను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం సీనియర్ నాయకుడు దామోదర్‌రెడ్డి

మాడుగులపల్లి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా వ్యవసాయ చట్టాలకు మార్పు చేసి రైతుల నడ్డి విరుస్తోందని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని ఇందుగుల గ్రామంలో ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను నిర్వీర్యం చేసి రైతులకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్యులపై ఆర్థిక భారం మోపిందని ఆరోపించారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు రైతు సంఘం సీనియర్ నాయకుడు మద్దిరెడ్డి దామోదర్‌రెడ్డి ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి .వెంకన్న, సర్పంచ్ కన్నయ్య, శ్రీకర్, చిట్టి శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాశం, రాంబాబు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలి



తడకమళ్ల శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న బీఎల్ఆర్

మిర్యాలగూడ : కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలోని శివాలయంలో మాజీ సీఎల్పీ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ఆరోగ్యంగా క్షేమంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఎల్ఆర్ రెండోవిడత 'హాథ్ సే హాథ్ జోడో' కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. దళితులకు మూడెకరాల భూపంపిణీ, నిరుద్యోగులకు భృతి, రైతులకు ఉచిత విద్యుత్, గిరిజనబంధు, దళితబంధు, పోడు భూముల సమస్య వంటి అనేక వాగ్దానాలను ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ పేద, మధ్య తరగతి వర్గాలపై అధిక పన్నులను మోపుతూ వారి నడ్డి విరుస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆవుల దేవేందర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి దూరంగా బీఆర్ఎస్ నాయకులు

దేవరకొండ : పట్టణంలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ పట్టణ, మండల ఆత్మీయ సమ్మేళనానికి పలువురు దేవరకొండ మండల, పట్టణ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు దూరంగా ఉన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనాల్సిన అధికార పార్టీ నేతలు యాదగిరిగుట్ట దేవస్థానానికి దర్శనానికి బయల్దేరివెళ్లారు. మాజీ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ వడ్త్య దేవేందర్‌నాయక్, దేవరకొండ ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, రైతు బంధు అధ్యక్షుడు శిరందాసు కృష్ణయ్య తో పాటు మరికొంత మంది బీఆర్ఎస్ నాయకులు స్థానికంగా జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కాకపోవడం చర్చకు దారితీసింది.

దేవాలయ నిర్మాణానికి రూ. 50వేలు విరాళం

పెద్దవూర : మండలంలోని చింతపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కనకదుర్గమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ కంచర్ల సత్యనారాయణరెడ్డి రూ. 50వేలు విరాళం అందజేశారు. ఆ నగదును గురువారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు సత్యనారాయణరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకిరెడ్డి ప్రభావతి సంజీవరెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

కొండమల్లేపల్లి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ తమవంతుగా కృషి చేయాలని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సిద్దిక్ అన్నారు. గురువారం దేవరకొండ మైనార్టీ గురుకుల పాఠశాలలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. అంబేద్కర్‌ను సమానత్వపు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అంబేద్కర్ అడుగుజాడల్లో నడవలన్నారు. సూతఃఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రసాద్, అధ్యాపకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

హాలియా : ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు హాలియా అగ్నిమాపక అధికార ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు హాలియా పట్టణంలోని రద్దీ ప్రదేశాలు, పరిశ్రమలు, హాస్పిటల్స్, సినిమా థియేటర్స్, పాఠశాలలు, తదితర ప్రదేశాల్లో ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొంటుంది



కొండమల్లేపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్



మిర్యాలగూడ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు



హాలియా : మధారిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



త్రిపురారం : బాబుసాయి పేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ విజయభాస్కర్



వేములపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పుట్టల సునీత

కొండమల్లేపల్లి : ప్రతి ధాన్యం గింజనూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించే గ్రేడ్-ఏ రకం ధాన్యానికి రూ.2,606, కామన్ గ్రేడ్ రకానికి రూ.2040 మద్దతు ధర అందనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు అధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, యుగేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, బొల్లంపల్లి విష్ణుమూర్తి, రమావత్ దస్రూనాయక్, అమర్‌సింగ్, యాదగిరిరెడ్డి, వస్కుల కృష్ణయ్య, బొడ్డు గోపాల్, రమావత్ హిమవంత్‌కుమార్, ఏఈవో సురేష్, ఏవో వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యం

మిర్యాలగూడ : రాష్ట్రంలో రైతుల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలంలోని తుంగపాడు, దామరచర్ల మండలంలోని దిలావర్‌పూర్, కేజేఆర్ కాలనీలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదగాలన్నారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, ఎంపీపీ నరశహన్మంతరెడ్డి, గోతు హాతిరాంనాయక్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు ఏడుకొండల, మండల పార్టీ అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ ఆదిరెడ్డి, వ్యవసాయ అధికారులు, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మీ, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాలియా : రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో తెలంగాణలో తప్ప ఎక్కడ కొనుగోలు చేయడం లేదని మద్దతు ధర ఇచ్చి ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని మధారిగూడెం, పేరూర్, వీర్లగడ్డతండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు లింగారెడ్డి, రంజిత్ యాదవ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు చినబిక్షం యాదవ్, మున్సిపల్ కౌన్సిల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు వర్రె వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరాజు యాదవ్, మార్కెట్ డైరెక్టర్ పోషం శ్రీనివాస్‌గౌడ్, మండల కోఆప్షన్ మున్నా, సర్పంచ్‌లు సైదులు, సంధ్యరాము, సుధారాణినాగరాజు, ఏపీఎం కళావతి, నాయకులు బెద్దూరి వెంకట్‌రెడ్డి, చల్లా మట్టారెడ్డి, సరేందర్‌రావు, ఏఈఓ, రైతులు తదితరులు ఉన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : రైతు సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని చిల్లాపురం, బోయగూడెం, కొంపల్లి గ్రామాల్లో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంగోతు భగవాన్ నాయక్, జెడ్పీటీసీ అంగోతు సూర్యభాషా నాయక్, వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, సునీతాకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరాజు యాదవ్, నాయకులు బొల్లేపల్లి రమణరాజు, కట్టెబోయిన అనీల్ కుమార్, షేక్ రహీం, రవి నాయక్, సత్యంరెడ్డి, ఏఓ జానికిరాములు, ఏపీఎం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోవాలి

త్రిపురారం : రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోవాలని బాబుసాయి పేట ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ గోపగాని విజయ భాస్కర్ అన్నారు. గురువారం బాబుసాయిపేట, కంపాసాగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వరుస క్రమంలో కాంటలు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం తీసుకవచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ గౌని ఉపేందర్, వైస్ ఎంపీపీ మట్టయ్య, ఎంపీటీసీ గుట్టు యాదగిరి, ఉప సర్పంచ్ గంగుల రేణుక శ్రీనివాస్, బచ్చు సాంబయ్య, గంగుల ఉపేందర్, చిన్న మట్టయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం, ఆమనగల్లు, రావులపెంట, లక్ష్మీదేవిగూడెం గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ పుట్టల సునీత వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఝాన్సీ, కృష్ణవేణి, ఎంపీటీసీలు శ్రీరాంరెడ్డి, లలిత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి, ఏఓ రుషేంద్రమణి, ఏసీఎం అనూక్, సంఘబంధం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణలో అంబేద్కర్‌కు అరుదైన గౌరవం



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

త్రిపురారం : తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీకి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టి 125అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గర్వకారణమని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కామర్ల జానయ్య, దళిత సంఘం సీనియర్ నాయకులు బైరం కృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండలంలోని పలు దళిత సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ ప్రభుత్వానికి దళిత సంఘాల ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలిపారు.నేడు హైదరాబాద్‌లో నిర్వహించే అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా గ్రామాల నుంచి దళితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మడుపు వెంకటేశ్వర్లు, అవిరెండ్ల సైదులు, డాల్ నర్సింహ, దైద రవి, రేవూరి కోండల్, దాసరి అడివయ్య, కలకొండ సైదులు, దోరెపల్లి రాములు, సైదులు, కుమ్మరి విజయ్, వల్లపుదసు దశరథ, రెమడాల హుస్సెన్, దేవరకొండ రాంబాబు, కోండల్, కత్తి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



హాలియాలో జెండా ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నేత వెంకట్రాంరెడ్డి

హాలియా : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం హాలియా పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రాంతీయ కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నాయకుడు కోడుమూరి వెంకట్రాంరెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలతో పాటు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ రాష్ట్రంలో అంచెలంచెలుగా ఎదుగుతున్న సంఘం టీఎస్‌యూటీఎఫ్ అని కొనియాడారు. సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ సంఘం సీనియర్ నాయకులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల ప్రసాద్, షేక్ జలీల్, చెన్ను వెంకట్‌రెడ్డి, సైదులు, షరీఫ్, మచ్చ సునీత, సరిత, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రవీందర్, యూటీఎఫ్ నాయకులు నాగుల సైదులు, రవీంద్రబాబు, కృష్ణ, సైయ్యద్ మియా, జానీపాషా, నాగేశ్వర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వేసవిలో నీటిని పొదుపుగా వాడుకోవాలి

కొండమల్లేపల్లి : వేసవిలో నీటిని చాలా పొదుపుగా వాడుకోవాలని ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. గురువారం నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు మండలంలోని అంబోతు తండా పంచాయతీ పరిధిలో ఎంపీపీ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన పంప్ సెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నీటిని వృథా చేయొద్దని తండా వాసులకు సూచించారు. అలాగే పంపు సెట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తండా వాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ జగన్‌నాయక్, సుఖ్యానాయక్, ఎండి.ఖదీర్, మహేందర్, కార్తీక్, రమేశ్, అంజి, పాల్గొన్నారు.

జానారెడ్డిని పరామర్శించిన నాయకులు



జానారెడ్డితో మండల నాయకులు

వేములపల్లి : అస్వస్థతకు గురైన సీఎల్పీ మాజీ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా జానారెడ్డి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ చిరుమర్రి కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు కందిమళ్ల లక్ష్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కాంతారెడ్డి, సత్తిరెడ్డి, పుట్టల వెంకన్న, భస్మయ్యగౌడ్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఆరు నెలల జైలు

మిర్యాలగూడ టౌన్: మహిళపై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఆరు నెలలు జైలుశిక్ష విధిస్తూ గురువారం మిర్యాలగూడ అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి సీహెచ్ ఆశాలత తీర్పు వెల్లడించారు. వివరాలు.. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన చంద్రగిరి రాములమ్మ భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలతో కలిసి మండల కేంద్రంలోనే తన తల్లి దగ్గర ఉంటోంది. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన పగిడిపల్లి శ్రీనివాస్‌రావు తనకు రాములమ్మ సహకరించడం లేదని ఆమెపై కక్ష పెంచుకున్నాడు. రాములమ్మను చంపేందుకు పథకం వేసుకున్న శ్రీనివాస్‌రావు 2016 మార్చి 18వ తేదీ రాత్రి 9గంటల సమయంలో తనతో తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడికి యత్నించగా ఆమె కేకలు వేయడంతో పరారయ్యాడు. ఈ దాడిలో గాయాలపాలైన రాములమ్మను కుటుంబ సభ్యులు దామరచర్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి వాడపల్లి ఎస్ఐ వీరరాఘవులు కేసు నమోదు చేసి చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. గురువారం ఈ కేసు తుది విచారణకు రాగా నిందితుడు పగిడిపల్లి శ్రీనివాస్‌రావుపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లింగంపల్లి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. ఆయనకు కోర్టు పీసీ ఎంఏ యూనిస్, లైజన్ ఆఫీసర్ సైదులు సహకరించారు.